# డైరెక్టర్

(స్వాతంత్ర్య దిన పోటీలో బహుమతి పొందింది.)




హోటల్ స్కైలెన్‌లో రూం నంబరు 444 పెళ్ళివారిల్లులాగా కళకళ లాడుతోంది.

ఒక ప్రక్కన సినీ నిర్మాత ఆనందరావు, నూతన దర్శకుడు ప్రయోగస్వామి సోఫామీద కూర్చుని ఉన్నారు. మరోకవైపు అసోసియేట్ డైరెక్టరు శివం ఉన్నాడు. అతని ప్రక్కన నూతన తార సుభాషిణి ఉంది. ఎదురుగా ఉన్న సోఫామీద నూతన హీరో, సైడ్ హీరో వగైరాలు కూర్చొని ఉన్నారు.

శివం- సుభాషిణి ఆ మర్నాడు జరుగబోయే శతదినోత్సవ వేడుకలో ఏ విధంగా మాట్లాడాలో వివరించి, అభినయించి చూపుతున్నాడు.

అందరూ నూతన తారలతో ప్రయోగాత్మకంగా 'నవచిత్ర' సంస్థ నిర్మించిన చిత్రం మంచి విజయం సాధించింది. 15 కేంద్రాలలో శతదినోత్సవ వేడుకలు జరుగనున్నాయి. ఇపుడు జరుగుతున్న హడావుడి అంతా మర్నాడు విజయవాడలో జరిగే ప్రధాన మహోత్సవ వేడుకలు గురించి! ఆ కార్యక్రమం రసవత్తరంగా ఉండడానికి, పనిలో పనిగా తమ యూనిట్‌లోని వారికి ప్రచారం వచ్చేటట్లు చేయడానికి పకడ్బందీగా పథకాన్ని రూపొందిస్తున్నారు వారు.

దాని ప్రకారం అసోసియేట్ డైరెక్టర్- డైరెక్టర్‌గారినీ.., వీరిద్దరూ- నూతన నటీ నటులనూ.., చివరకి అందరూ నిర్మాతనీ.., నిర్మాతగారు- డైరెక్టర్‌గారినీ... ఈ విధంగా పరస్పరం మెచ్చుకుంటూ అతి వినయం ఒలకబోస్తూ ఉపన్యసిస్తారు. దానికే రిహార్సల్స్ జరుగుతున్నాయి.

పాపం... శివం ఎంతో ఓర్పుతో హీరోయిన్ సుభాషిణికి చిలుక పలుకులు వినిపిస్తున్నా అవి ఆమెకు నోరు తిరగడంలేదు. ఆయన చెప్పిన విధంగా మాటలను పలుకలేక పోతోంది. అనగలిగిన మాటలను కూడా అంతలోనే మరిచిపోతోంది.

ఇదంతా చూసి ప్రాణం విసిగిపోయి, "చూడుతల్లీ... నీ వంతు వచ్చేసరికి నేను సైడ్ కర్టెన్‌లోకి వెళ్లి నువ్వు అనవలసిన మాటలను ప్రాంప్టింగ్ ఇస్తాను. ఆ నాలుగు ముక్కలూ అనేసి వచ్చి కూర్చో!" అన్నాడు శివం.

"ఓ... దానిదేముంది! నాటకాలలో ప్రాంప్టింగ్ అందుకోవడం నాకు అలవాటే!" అంది సుభాషిణి.

"హమ్మయ్య... బ్రతికించావు!" అంటూ ఊపిరి పీల్చుకున్నాడు శివం.

మర్నాడు శతదినోత్సవ కార్యక్రమం మొదలయింది.

ప్రముఖుల ఉపాన్యాసాల తర్వాత 'లేడీస్ ఫస్టు' అన్నట్లుగా సుభాషిణి వంతు వచ్చింది.

కంగారుగా లేచి మైకు దగ్గరకి వెళ్లింది సుభాషిణి.

"సభికులకు, పెద్దలకు నమస్కారం!" సైడు కర్టెన్‌లోంచి శివం అన్నాడు.

చక్కగా అప్పజెప్పింది సుభాషిణి. అయితే సభాకంపంతో చెమటలు పోశాయి.

"నాకు నటన అంటే ఏమిటో బొత్తిగా తెలీదు. అంతా డైరెక్టరుగారే నేర్పారు. ప్రయోగస్వామిగారు కొత్త ప్రయోగం చేసి సార్థక నాములయ్యారు" మళ్లీ అన్నాడు శివం.

వాక్యాలు పెద్దవి కావడంతో కంగారుపడిపోయింది సుభాషిణి. ఆ గాభరాలో "డైరెక్టర్‌గారికి నటనంటే బొత్తిగా తెలీదు. అంతా నేనే నేర్పాను. కొత్త ప్రయోగాలు చేశాను. సార్ధక నామం అయ్యాను" అంది.

శివంకి పట్టరాని కోపం వచ్చింది. పళ్లు కొరుకుతూ– "ఓసి, నిన్ను తగలెయ్యా... నీకిదేం రోగమే..?" అన్నాడు.

"ఓసి, నిన్ను తగలెయ్యా... నీకిదేం రోగమే..?" చిలుక పలుకులు వల్లించింది సుభాషిణి.

హాలు చప్పట్లు ఈలలతో దద్దరిల్లిపోయింది.

వెంటనే డైరెక్టర్ ప్రయోగస్వామి మైకు దగ్గరకి వెళ్లాడు.

"మహాశయులారా! గౌరవనీయులైన మా ప్రియ ప్రేక్షకులారా! ఇపుడు మీరొక రసవత్తర ఘట్టాన్ని చూశారు. అందరూ కొత్తవారితో చిత్రం నిర్మించ తలపెట్టినా మేము మొదట్లో ఎన్ని అవస్థలు పడవలసి వచ్చిందో చూపించడానికే కుమారి సుభాషిణి ఆ విధంగా అవమానంగా అభినయించి మిమ్మల్ని సస్పెన్స్‌లో ముంచెత్తింది. ఏమాత్రం నటనానుభవం లేనివారితో ఇంతటి విజయవంతమైన చిత్రం నిర్మించగలగడానికి మా యూనిట్‌లోని అందరూ బాధ్యులే! అంతకుమించి– ఈ అందరి అభిమానంతో ఇప్పుడు సుభాషిణిగారు పలికిన పలుకులు మా తదుపరి చిత్రంలోని ఒక సన్నివేశం లోనివి. ఒక అమాయక పల్లె పడుచులోని ప్రతిభని గుర్తించి దర్శకుడు ఆమెను నటిగా చేయబోయినప్పుడు ఎదురైన ఇబ్బందులే ఈ సన్నివేశం!" అంటూ చెప్పుకుపోయాడు.

హాలు మళ్లీ సభికుల హర్షధ్వానాలతో దద్దరిల్లిపోయింది.

కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

అంతా అయ్యాక– "డైరెక్టరూ... నిజంగా నువ్వే డైరెక్టరువయ్యా! నా రెండో చిత్రానికి కూడా నువ్వే డైరెక్టరువి!" అంటూ ప్రయోగస్వామి భుజాన్ని ఆప్యాయంగా తట్టాడు నిర్మాత ఆనందరావు.

– విశ్వ రచన పక్ష పత్రిక... *1 సెప్టెంబర్ '90*